క్లుప్తంగా

కాణిపాకంలో తెనాలి చిన్నారుల నృత్యం



తెనాలి: కాణిపాకంలోని స్వయంభు శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల్లో ఆదివారం రాత్రి తెనాలికి చెందిన శ్రీలక్ష్మీనారాయణ కూచిపూడి నృత్య కళానికేతన్ బృందం నృత్యాంశాల్ని ప్రదర్శించింది. గురువు పెసర్లంక వసంతదుర్గ శిష్య బృందం ప్రదర్శించిన కూచిపూడి నృత్యాంశాలకు అభినందనలు దక్కాయి. దేవస్థానం ట్రస్ట్‌బోర్డు బాధ్యులు జ్ఞాపికల్ని అందజేశారు.

రౌడీషీటర్ల కదలికలపై నిఘా



తెనాలి రూరల్: రౌడీషీటర్ల కదలికలపై పటిష్ఠ నిఘా ఏర్పాటు చేశామని రూరల్ ఎస్ఐ సీహెచ్. వెంకటేశ్వర్లు తెలిపారు. తెనాలి రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు సోమవారం ఆయన కౌన్సెలింగ్ ఇచ్చారు. వివాదాలు, ఘర్షణల్లో ప్రమేయం ఉందని తెలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అవాంఛనీయ ఘటనలకు పాల్పడకుండా సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. వివాదాలు, ఘర్షణల్లో ప్రమేయం ఉన్నట్టు తెలిస్తే బహిష్కరణ వేటు వేసే అవకాశం ఉందని స్పష్టం చేశారు. సత్ప్రవర్తన కలిగిన వారిపై షీట్ ఎత్తి వేసే అంశాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగేలా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

ప్యాసింజర్ రైళ్లను పునరుద్ధరించాలి

తెనాలి రూరల్: కరోనా సందర్భంగా రద్దు చేసిన అనేక ప్యాసింజర్ రైళ్ల కారణంగా సామాన్యులు పలు ఇబ్బందులకు గురవుతున్నారని, వెంటనే వాటిని పునరుద్ధరించాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు విజ్ఞప్తి చేశారు. తెనాలి రైల్వేస్టేషన్ మేనేజర్ టీవీ రమణను ఏఐఎస్ఎఫ్ నాయకులు సోమవారం కలిశారు. ప్యాసింజర్ రైళ్లను పునరుద్ధరించడంతో పాటు ఎక్స్‌ప్రెస్‌ల్లో జనరల్ బోగీల సంఖ్యను పెంచాలని కోరారు. వందే భారత్ రైళ్ల చార్జీలను తగ్గించి సామాన్యులకు అందుబాటులోకి తీసుకు రావాలని కోరారు. స్టేషన్ మేనేజర్‌ను కలిసిన వారిలో కుంభ రవితేజ, మద్దినేని కిరణ్‌బాబు, పాశం వెంకటేష్, బిళ్ల రాజేష్, గంజి గోపి, కోలా శేఖర్ ఉన్నారు.

ద్విచక్ర వాహనం చోరీ

మంగళగిరి: నగర పరిధిలోని పోస్టాఫీసు వద్ద ఓ నివాసంలో ద్విచక్ర వాహనం చోరీకి గురైన ఘటన చోటుచేసుకుంది. పట్టణ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పోస్టాఫీసు వద్ద నివాసముంటున్న రాజా అజయ్ మాథ్యూస్ ద్విచక్ర వాహనాన్ని ఇంటి కాంపౌండ్‌లో పార్కింగ్ చేసి నిద్రించారు. ఆదివారం తెల్లవారే సరికి వాహనం మాయమైంది. దీనిపై అజయ్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. సీసీ ఫుటేజ్ ఆధారంగా దుండగుడిని గుర్తించేందుకు యత్నిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలలో చోరీ

మంగళగిరి: నగరంలోని బ్యాంక్ కాలనీలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో చోరీ ఘటన చోటు చేసుకుంది. సోమవారం పట్టణ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పాఠశాల గదిలో రాగిజావ కాచేందుకు, కోడిగుడ్లు ఉడకపెట్టేందుకు గ్యాస్ స్టౌ, సిలిండర్ ఉన్నాయి. రోజులాగే శనివారం సాయంత్రం వాటిని గదిలో ఉంచి సిబ్బంది తలుపులు వేసి వెళ్లారు. సోమవారం ఉదయం వచ్చి చూడగా గది తలుపులు పగలగొట్టి ఉన్నాయి. స్టౌ, సిలిండర్ కనిపించకపోవడంతో చోరీ జరిగిందని తెలుసుకున్న ప్రధానోపాధ్యాయుడు కోటిరెడ్డి పోలీసులుకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ద్విచక్ర వాహనదారులపై మందుబాబుల దాడి

మంగళగిరి: నగర పరిధిలోని నవులూరు భగత్ సింగ్ నగర్ వద్ద ఆదివారం రాత్రి మందుబాబులు అలజడి సృష్టించారు. ఓ మహిళ గాయపడిన ఘటన చోటుచేసుకుంది. పట్టణ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నగర పరిధిలోని చినకాకానికి చెందిన గుమ్మా బుల్లెమ్మ, అంకమ్మరావు దంపతులు యర్రబాలెం అంకమ్మ తల్లి కొలుపులకు వెళ్లారు. తిరిగి బుల్లెమ్మ దంపతులు ఒక ద్విచక్రవాహనం, బుల్లెమ్మ సోదరుడు మరో ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా రైల్వేగేటు వద్ద ఉన్న ఇద్దరు మందుబాబులు బుల్లెమ్మ సోదరుడిని ఆపి డబ్బులు లాక్కునేందుకు యత్నించి అతనిపై దాడికి దిగారు. వెనుక వస్తున్న బుల్లెమ్మ, అంకమ్మరావులు అడ్డుకుని ప్రశ్నించడంతో వారితో వివాదానికి దిగారు. దీన్ని పట్టించుకోకుండా బుల్లెమ్మ దంపతులు ద్విచక్రవాహనం ఎక్కగా, ఓ యువకుడు ఆమె జడ పట్టుకుని లాగడంతో ద్విచక్రవాహనం నుంచి కిందపడడంతో గాయాలయ్యాయి. ఈ మేరకు బుల్లెమ్మ దంపతులు పట్టణ స్టేషన్‌కు చేరుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రజారోగ్య భద్రతే సీఎం జగన్ ధ్యేయం

- జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను సద్వినియోగం చేసుకోండి
- ఎమ్మెల్యే శివకుమార్



పాండురంగపేటలో జరిగిన శిబిరంలో పేర్లు నమోదు చేయించుకుంటున్న ప్రజలు

కొల్లిపర: రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు సంక్షేమంతో పాటు ఆరోగ్య భద్రతే ధ్యేయంగా వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తూ అనేక పథకాల్ని అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పేర్కొన్నారు. కొల్లిపర గ్రామ సచివాలయం- 1 పరిధిలోని అవుతు రామిరెడ్డి జూనియర్ కళాశాల ఆవరణలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. ఎమ్మెల్యే రోగులతో మాట్లాడారు. శిబిరంలో అందుతున్న వైద్యసేవల్ని అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ప్రభుత్వం కల్పిస్తున్న అన్ని వైద్య సదుపాయాల్ని వినియోగించుకోవాలని కోరారు.ఆంధ్రప్రదేశ్‌ను ఆరోగ్యాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడానికి సీఎం జగన్ కృషి చేస్తున్నారు. ప్రజలకు స్థానికంగానే స్పెషాలిటీ వైద్యసేవలు అందించాలనే లక్ష్యంతో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం తీసుకువచ్చారని వివరించారు. ప్రజలు చిన్న పాటి అనారోగ్య సమస్యకు గురైనా అశ్రద్ధ వహించకుండా ప్రభుత్వ వైద్య సేవల్ని పొందాలని కోరారు. సురక్ష శిబిరంలో ఉచితంగా రక్త పరీక్షలు, బీపీ, షుగర్ తదితర 14 రకాల పరీక్షలతో పాటు 120 రకాల మందులు కూడా అందజేస్తున్నారని తెలిపారు. రోగి అనారోగ్య పరిస్థితిని గుర్తించి మెరుగైన వైద్యం అవసరమయితే ఆరోగ్యశ్రీ పథకంలో వారిని కార్పొరేట్ ఆసుపత్రుల్లో వారిని చేర్పించి ఉచితంగా వైద్య సేవలు అందించడంతో పాటు మందులు కూడా ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ పిల్లి రాధిక, జొన్నల శివారెడ్డి, భీమవరపు సంజీవరెడ్డి, పార్టీ గ్రామ కన్వీనర్ భీమవరపు శివకోటిరెడ్డి, ఉప సర్పంచ్ అవుతు కృష్ణారెడ్డి ,పార్టీ మండల అధ్యక్షుడు అవుతు పోతిరెడ్డి, కళ్లం వీరారెడ్డి, నెర్ల కుటుంబరెడ్డి, ఎంపీడీవో విజయలక్ష్మి, తహసీల్దార్ నాంచారయ్య, మండల వైద్యాధికారిణి డాక్టర్ లక్ష్మీసుధ, డాక్టర్ ప్రియాంక, బొమ్మారెడ్డి ప్రభాకరరెడ్డి పాల్గొన్నారు.



కొల్లిపర శిబిరంలో రోగులను పరీక్షలు చేస్తున్న వైద్యులు

ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోండి.

తెనాలి అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఎం.జశ్వంతరావు సూచించారు. పాండురంగపేటలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. 24, 25 వార్డుల పరిధిలోని ప్రజలు అక్కడకు వచ్చి వైద్య సేవలు పొందారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజల ఆరోగ్యానికి భరోసా కల్పించేందుకు ప్రభుత్వం ఈ కార్యక్రమం నిర్వహిస్తోందని తెలిపారు. మెరుగైన వైద్యాన్ని ఉచితంగా పేదలకు ఇక్కడ అందిస్తున్నట్లు చెప్పారు. పేదలకు అవసరమైన వ్యాధి నిర్ధారణ పరీక్షలు, స్పెషాలిస్ట్ వైద్యుల సేవలు ఇక్కడ అందుబాటులో ఉన్నాయని, మందుల్ని కూడా ఉచితంగా ఇస్తున్నట్లు చెప్పారు. శిబిరంలో జనరల్ ఓపీ 129, సర్జరీ ఓపీ 68, ఫిజీషియన్ ఓపీ 87, ఆప్తమాలజీ ఓపీ 127 మంది వైద్యసేవలు పొందినట్లు ఆయన వివరించారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి తలాటం మురళీకృష్ణ, సుబ్బారాయణం, 24వ వార్డు కౌన్సిలర్ పెదలంక లక్ష్మీ లావణ్య, మున్సిపల్ ఆరోగ్యాధికారి డాక్టర్ హెలెన్ నిర్మల, ఏసీపీ సుబ్బారావు, డీఈ నాగభూషణం, ఏఈ ఫణి, సహాయ మలేరియా అధికారి సీహెచ్.ప్రభాకర్ రెడ్డి, సీడీపీవో సునీత, సూపర్‌వైజర్ కె.సౌజన్య, ఆరోగ్య విస్తరణాధికారి అంది బాలచంద్రమౌళి, ఆరోగ్య, మున్సిపల్ సిబ్బంది, వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.



కొల్లిపర శిబిరంలో రోగుల ఆరోగ్య పరిస్థితులు గురించి అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే



మెడికల్ క్యాంప్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ జశ్వంతరావు, అధికారులు



పాండురంగపేట శిబిరంలో రోగులకు ఆరోగ్య పరీక్షలు

ఆశా వర్కర్లకు కనీస వేతనం రూ.21 వేలు ఇవ్వాలి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు డిమాండ్

తాడేపల్లిరూరల్: ఆశా వర్కర్లకు కనీస వేతనం రూ.21 వేలు ఇవ్వాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో ఆకస్మికంగా మృతిచెందిన ముగ్గు రోడ్డు ప్రాంతానికి చెందిన ఆశా వర్కర్ కృపమ్మ కుటుంబాన్ని ఆయన సోమవారం పరామర్శించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ విధి నిర్వహణలో కృపమ్మ మృతి చెందడం బాధాకరం అన్నారు. ఆశా వర్కర్లతో పని చేయిచుకుంటూ తక్కువ వేతనం ఇవ్వడం సరికాదని, వారికి కనీసం రూ.21 వేలు వేతనాన్ని అందజేయాలని అన్నారు. అతి చిన్న వయసులో ఆకస్మికంగా కృపమ్మ మృతి చెందడం ఆమె కుటుంబానికి తీరని లోటని అన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జొన్నా శివశంకరరావు, సీపీఎం మండల కార్యదర్శి దొంతిరెడ్డి వెంకటరెడ్డి, ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి కె.ధనలక్ష్మి, జిల్లా అధ్యక్షులు కొప్పనాతి లక్ష్మి, సీఐటీయూ పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.



కృపమ్మ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

చికిత్స పొందుతూ బీటెక్ విద్యార్థిని మృతి

మంగళగిరి: ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బీటెక్ చదువుతున్న విద్యార్థిని మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు నగర పరిధిలోని నూతక్కికి చెందిన అన్నపురెడ్డి (లోహిత) విజయవాడ ఎనికేపాడులోని ఓ ప్రైవేటు కళాశాలలో బీటెక్ మూడో సంవత్సరం చదువుతోంది. కొద్దికాలంగా కడుపు నొప్పితో బాధపడుతోంది. దాన్ని తట్టుకోలేక సెప్టెంబర్ 28న ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో పురుగుమందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన కుటుంబసభ్యులు చినకాకానిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్చారు. చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందింది. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కేఎల్‌యూకు అవార్డు



తాడేపల్లిరూరల్: వడ్డేశ్వరంలోని కేఎల్ యూనివర్సిటీని కేంబ్రిడ్జి యూనివర్సిటీ ప్రతినిధుల బృందం సోమవారం సందర్శించింది. వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు మాట్లాడుతూ అనేక సంవత్సరాలుగా కేంబ్రిడ్జి అసెస్‌మెంట్ పరీక్షను విజయవంతంగా అందించినందుకు తమ విశ్వవిద్యాలయం గెలుచుకున్న అవార్డు అందజేశారని తెలిపారు. కేఎల్ యూనివర్సిటీ ఎమర్జింగ్ స్టార్ ఆఫ్ ది ఇయర్ 2022-23గా అవార్డు పొందిందని అన్నారు. అనంతరం కేంబ్రిడ్జి అసెస్‌మెంట్ ప్రతినిధుల బృందం అవార్డు ధ్రువీకరణ పత్రాన్ని రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, ఎఫ్ఇడి డైరెక్టర్ డాక్టర్ ఎ.జగదీష్‌లకు అందజేశారు. కార్యక్రమంలో వర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథివర్మ, ప్రొ వైస్ చాన్సలర్లు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకటరామ్, అంతర్జాతీయ సంబంధాల డీన్ డాక్టర్ ఎం.కిషోర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

పిచ్చి కుక్కలు కరిచిన గేదెలు రేబిస్‌తో మృతి

కొల్లూరు : పిచ్చి కుక్కల కరవడంతో పశువులు అనారోగ్యం బారిన పడి మృతి చెందిన ఘటన మండలంలోని కిష్కింధపాలెంలో చోటుచేసుకుంది. పశువుల యజమానుల కథనం మేరకు.. నెల రోజుల కిందట గ్రామానికి చెందిన పులివర్తి కృపానందం, పోలిమట్ల ఏబులకు చెందిన రెండు పశువులు కుక్క కాటుకు గురయ్యాయి. విషయం తెలియని యజమానులు వాటికి ఎటువంటి వైద్యసేవలు అందించకుండా మిన్నకుండిపోయారు. కుక్క కాటుకు గురైన రెండు పశువులకు రేబిస్ వ్యాధి ముదరడంతో సోమవారం ఉన్నపళంగా మృతి చెందాయి. కృపానందానికి చెందిన ఈతకు వచ్చిన గేదె మృతి చెందడంతో రూ. 50 వేలు, ఏబుకు చెందిన గేదె మరణించడంతో రూ.25 వేల వరకు నష్టం వాటిల్లిందని వారు వాపోతున్నారు. గ్రామంలో ఇటీవల కుక్కల బెడద అధికమయ్యిందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



కిష్కిందపాలెంలో మరణించిన పశువు వద్ద యజమాని..

ప్రతి మహిళకు కుట్టు శిక్షణ తప్పనిసరి

వేమూరు: కుట్టు మిషన్ నైపుణ్యత ప్రతి మహిళకు అవసరమని ఎంపీడీవో శ్రీనివాసరావు అన్నారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం మహిళలకు కుట్టు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు కుట్టు శిక్షణ పొందడం వల్ల ఆర్థిక పరిస్థితులను మెరుగుపరుచుకోవచ్చన్నారు. ప్రతి మహిళకు తప్పనిసరిగా కుట్టు శిక్షణ అవసరమన్నారు. ఉషా కంపెనీ, విజయవాడకు చెందిన వాసవ్య మహిళా మండలి, తెనాలి ఏఐఆర్‌టీడీఎస్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు ఎంపీడీఓ తెలిపారు. కుట్టు శిక్షణ పొందిన ప్రతి మహిళకు ఉచితంగా కుట్టు మిషన్ అందజేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఉషా కంపెనీ డెప్యూటీ మేనేజరు టి.రాజ్ కుమార్, యర్రు సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.



కుట్టు శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న అధికారులు

విద్యార్థుల అభివృద్ధిలో తల్లిదండ్రుల పాత్ర కీలకం

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థుల భవిష్యత్తు తీర్చిదిద్దడంలో తల్లితండ్రులది కీలకపాత్రని టీజేపీఎస్ కళాశాల కరస్పాండెంట్ కె.వి. బ్రహ్మం పేర్కొన్నారు. పట్టాభిపురంలోని కళాశాలలో సోమవారం విద్యార్థులు - తల్లిదండ్రులు సమావేశం నిర్వహించారు. బ్రహ్మం మాట్లాడుతూ పిల్లల్ని కళాశాలలో చేర్పించడంతో పేరెంట్స్ బాధ్యత నెరవేరినట్టు కాదని చెప్పారు. తరచుగా కళాశాలకు వచ్చి విద్యార్థుల గురించి తెలుసుకోవాలని సూచించారు.పిల్లల అభివృద్ధిలో గురువులతో పాటు తల్లిదండ్రులకు సైతం బాధ్యత ఉందని తెలిపారు. విద్యార్థుల్ని చెడుతోవ పట్టించే మొబైల్, చెడు స్నేహాలు, వ్యసనాలను గుర్తించడంతో పాటు వారి ఆలోచనల్ని గమనిస్తూ ఉండాలని సూచించారు. కళాశాలలోని అన్ని సౌకర్యాల్ని విద్యార్థులు వినియోగించుకుని జీవితంలో అభివృద్ధి చెంది, తల్లిదండ్రులకు, కళాశాలకు మంచి పేరు, ప్రఖ్యాతలు తీసుకురావాలని ఆయన తెలిపారు. ప్రిన్సిపాల్ ఏబీపీ మనోహర్, వైస్ ప్రిన్సిపాల్ బాను మురళి, మార్కండేయులు, కవిత, స్వామి, శ్రీనివాస్, బాజీ, పి.కుమార్ పాల్గొన్నారు.

ఉండవల్లి లిఫ్ట్ ఇరిగేషన్‌కు విద్యుత్ సరఫరా చేయాలి

తాడేపల్లిరూరల్: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని ఉండవల్లి లిఫ్ట్ ఇరిగేషన్ పంపింగ్ స్కీమ్‌కు విద్యుత్ సరఫరా అందజేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం నాయకులు సోమవారం ధర్నా నిర్వహించారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జొన్నా శివశంకరావు మాట్లాడుతూ ఉండవల్లిలోని పంపింగ్ స్కీమ్‌కు నాలుగు రోజుల నుంచి విద్యుత్ సరఫరా లేకపోవడంతో మోటర్లు పనిచేయడం లేదని, దీనిపై మీద ఆధారపడి సుమారు 300 ఎకరాలలో రైతులు పంటలు సాగుచేస్తున్నారని అన్నారు. పంట పాడైపోతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. అధికారులు వెంటనే స్పందించి పంపింగ్ స్కీమ్‌కు విద్యుత్ సరఫరా అందజేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో రాజధాని రైతు సంఘం అధ్యక్షుడు ఈశ్వర్‌రెడ్డి, తాడేపల్లి మండల రైతు సంఘం కార్యదర్శి మోదుగుల శ్రీనివాసరెడ్డి, ఉండవల్లి గ్రామ రైతు సంఘం ఉపాధ్యక్షులు పి.వీరాస్వామి, ఇస్సాకు, వేమా రామారావు, పెద్ద బసవయ్య తదితరులు పాల్గొన్నారు.

జనకథ రూపకంగా అంబేడ్కర్ జీవిత చరిత్ర

తెనాలి: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీవిత చరిత్రను జనబాహుళ్యంలోకి తీసుకెళ్లేందుకు జనకథ పేరుతో రూపకంగా తీసుకొచ్చిన విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు, కళాకారుడు మేకతోటి ప్రభాకరావు అభినందనీయుడని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ కనపర్తి అబ్రహాం లింకన్ తెలిపారు. జనకథ రూపక ఆవిష్కరణ ఆదివారం రాత్రి స్థానిక అయితానగర్‌లోని పొట్టి శ్రీరాములు కల్యాణ మండపంలో నిర్వహించారు. సభకు కనపర్తి బెన్‌హర్ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథి అబ్రహాం లింకన్ మాట్లాడుతూ భారతదేశ సమతుల్యమైన సమతా భావంతో ముందుకు వెళ్లాలంటే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాల్ని ముందుకు తీసుకెళ్లాల్సిన ఆవశ్యకత ఉందని తెలిపారు. అంబేడ్కర్ త్యాగనిరతి ఎక్కువ మందికి తెలియదన్నారు. ప్రతి ఒక్కరికీ తెలియజెప్పాల్సిన అవసరం ఇప్పుడు ఉందన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని మేకతోటి ప్రభాకర్ రూపక రచనతో ముందుకు రావడం శుభపరిణామంగా చెప్పారు. సమతావాదులు, మానవతావాదులు, అంబేడ్కరిస్టులు సమష్టిగా కార్యాచరణ తీసుకుంటే మంచి ఫలితాలు ఉంటాయని సూచించారు. మున్సిపల్ వైస్ ఛైర్మన్ అత్తోట నాగవేణి, దళిత మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నూకతోటి బాబూరావు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు, బహుజన కెరటాలు పత్రిక సంపాదకుడు పల్నాటి శ్రీరాములు, ఏఐఆర్ఎస్ఏ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ పేరాల సుధీర్‌పాల్, ఈపూరులంక సర్పంచ్ మేకతోటి శ్రీకాంత్, శ్రీనివాసరావు, న్యాయవాది పిల్లి విద్యాసాగర్, దేవరపల్లి వీరయ్య, కంచర్ల శేషు, గుర్రం జాషువా విజ్ఞాన సమితి అధ్యక్షుడు జె.న్యూటన్, రంగస్థల కళాకారులు ఏవీ కోటేశ్వరరావు, దాసరి వెంకటేశ్వరరావు, గుమ్మడి ప్రకాశరావు పాల్గొన్నారు. తొలుత డాక్టర్ అంబేడ్కర్ చిత్రపటానికి పుష్పాంజలి సమర్పించారు. మేకతోటి ప్రభాకరరావు జనకథను గానం చేశారు.



అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళి

స్పందనలో 13 అర్జీలు

తెనాలి: స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం స్పందన సమావేశం జరిగింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు జరిగిన కార్యక్రమంలో సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ ప్రజల నుంచి అర్జీల్ని స్వీకరించారు. ఆయా సమస్యల్ని వారి నుంచి వివరంగా తెలుసుకున్నారు. నిర్ణీత వ్యవధిలో పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. వివిధ గ్రామాల్నుంచి వచ్చిన ప్రజలు మొత్తం 13 అర్జీల్ని సమర్పించారు.

==స్థానిక రెవెన్యూ కార్యాలయంలో జరిగిన స్పందన సమావేశంలో మండల తహసీల్దార్ కె.రవిబాబు అర్జీల్ని స్వీకరించారు. ప్రజలు ముందుగా తమ పరిధిలోని సచివాలయంలో అర్జీల్ని సమర్పించాలని, అక్కడ పరిష్కారం కాకపోతేనే తమ వద్దకు రావాలని ఆయన సూచించారు.

మురుగు కాల్వలు బాగు చేయిచండి.

తెనాలి అర్బన్: సుల్తానాబాద్‌లోని మురుగు కాల్వల్ని బాగు చేయించాలని కోరుతూ ఆ ప్రాంతవాసులు మున్సిపల్ మేనేజర్ అప్పలరాజుకు వినతి పత్రం ఇచ్చారు. మున్సిపల్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఒక అర్జీ వచ్చిందని అధికారులు చెప్పారు. కార్యక్రమంలో పురపాలక సంఘ పరిధిలోని వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.



అర్జీదారుతో మాట్లాడుతున్న గీతాంజలి శర్మ

మంగళగిరిలో రౌడీషీటర్ హల్‌చల్

- పోలీసులకు ముచ్చెమటలు పట్టించిన వైనం
- అరెస్ట్ చేస్తే ఆత్మహత్య చేసుకుంటానంటూ బెదిరింపు
- ఎట్టకేలకు అదుపులోకి తీసుకున్న పోలీసులు



పోలీసులను అడ్డుకుంటున్న రౌడీషీటర్ కుటుంబసభ్యులు, స్థానికులు

మంగళగిరి: నగరంలో ఓ రౌడీషీటర్ కత్తి తీసుకుని హల్‌చల్ చేసి స్థానికులను భయభ్రాంతులకు గురిచేయడంతోపాటు రోజంతా పోలీసులను ముప్పుతిప్పలు పెట్టిన ఘటన చోటు చేసుకుంది. పట్టణ పోలీసులు తెలిపిన వివరాల మేరకు బాప్టిస్ట్‌పేటకు చెందిన రౌడీషీటర్ బుల్లా ఏసుబాబు(కత్తులోడు) ఆదివారం రాత్రి మద్యం తాగి కత్తి, రాడ్ తీసుకుని నగర పరిధిలోని ఎంఎస్ఎస్ కాలనీ, పాత మంగళగిరి ప్రాంతాలలో హల్‌చల్ చేస్తూ పలువురిపై దాడి చేశాడు. ఒకరికి తల పగిలి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులను భయభ్రాంతులకు గురి చేశాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. పోలీసుల రాకతో రౌడీషీటర్ అక్కడ నుంచి ఉడాయించాడు. పోలీసులు వెంబడించగా బాప్టిస్ట్‌పేటలో ఓ నివాసంలో దాక్కున్నాడు. అదుపులోకి తీసుకునేందుకు ప్రయత్నించగా రౌడీషీటర్ కుటుంబసభ్యులు, బంధువులు, స్థానికులు అడ్డగించి పోలీసులతో వాగ్వివాదానికి దిగారు. స్థానికంగా ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు అరెస్ట్ చేస్తారని భావించిన రౌడీషీటర్ ఇంటిలో చీరతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు నాటకానికి తెరతీశాడు. ఎట్టకేలకు పోలీసులు అదుపులోకి తీసుకుని ఎన్ఆర్ఐ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స చేయించారు. అనంతరం వైద్య పరీక్షలు నిర్వహించారు. రౌడీషీటర్ చేతిలో గాయాలపాలైన బాధితులు ఇద్దరు చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



తలకు కట్టుతో రౌడీషీటర్ కత్తులోడు

ఫాతిమా జీవితం స్ఫూర్తిదాయకం

తాడేపల్లిరూరల్(దుగ్గిరాల): భారతదేశ తొలి ముస్లిం మహిళా ఉపాధ్యాయురాలు, సంఘ సంస్కర్త షేక్ ఫాతిమా 1848లో తన ఇంటిలో మొదటి బాలికల పాఠశాల ఏర్పాటు చేసి, ఎందరికో స్ఫూర్తిగా నిలిచారని వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం జిల్లా ప్రధానకార్యదర్శి షేక్ సుభాని అన్నారు. దుగ్గిరాల జెండా చెట్టు సెంటర్‌లో భారత దేశ తొలి ముస్లిం మహిళా ఉపాధ్యాయురాలు, సంఘ సంస్కర్త షేక్ ఫాతిమా వర్ధంతి కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. సుభాని మాట్లాడుతూ ఆనాటి అసమాతల సమాజంలో అడుగడుగునా వివక్ష ఎదుర్కొంటూనే బాలిక విద్య కోసం, మహిళల హక్కుల కోసం సావిత్రిబాయి పూలేతో కలసి షేక్ ఫాతిమా పోరాడారని అన్నారు. ఆమె సేవలను గుర్తించిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2022లో ఎనిమిదో తరగతి తెలుగు పాఠ్యపుస్తకంలో జీవితచరిత్రను చేర్చి తగిన గౌరవం కల్పించిందని వివరించారు. కార్యక్రమంలో మహమ్మద్ ఖాసిం సాహెబ్, షేక్ రషీద్, పఠాన్ ఖాదర్, సయ్యద్ జలీల్, గాలేబ్ బేగ్, షేక్ బాజీ, షేక్ మస్తాన్‌వలీ, గురువిందపల్లి సుగుణరాజు,బులుసుపాటి యల్లేశ్వరరావు, కాకా వెంకటేశ్వర్లు, బొద్దులూరి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



ఫాతిమా చిత్రపటం వద్దనివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం నేతలు

విద్యార్థిపై దాడి

పట్నంబజారు: కళాశాలలో ఘర్షణ నేపథ్యంలో విద్యార్థిపై దాడి చేసిన ఘటనపై కేసు నమోదైంది. పాత గుంటూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కాకాని రోడ్డులో నివసించే బాలాజీ శ్రీ చైతన్య కళాశాలలో ఇంటర్ చదువుతున్నాడు. అదే కళాశాలకు చెందిన నాగసాయితో కొంతకాలం కిందట వివాదం జరిగింది. ఈ నేపథ్యంలో నాగసాయి, మరికొంత మంది కలసి బాలాజీపై కాకాని రోడ్డులో దాడి చేసి గాయపరిచారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.